73 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం అగ్రహారం లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 73 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. సత్యసాయిబాబా మందిరంలో సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కంటి వైద్యపరీక్షలు చేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు చంటిబాబు 73 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు 45 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేయడంతో పాటు ఆపరేషన్ నిమిత్తం10 మందిని వేమగిరి ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తల్లడిల్లుతున్న లంక గ్రామాలు

- గోదావరిలో క్రమేపీ పెరుగుతున్న వరద
- ఆందోళన చెందుతున్న ప్రజలు

ప్రజాశక్తి-యంత్రాంగం

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతుండటంతో జిల్లాలో లంక గ్రామాలు తల్లడిల్లుతున్నాయి. ఇప్పటికే కొద్ది రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు, తగ్గినట్లే తగ్గి.. మళ్లీ గోదావరిలో వరద పెరగడంతో లంక వాసులు భయాందోళనకు గురవుతున్నారు. పలు చోట్ల లంక గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. పొలాలు నీటమునిగాయి. **మామిడికుదురు** వరద తగ్గుతూ..పెరుగుతూ ఉండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందు తున్నారు. భద్రాచలం వద్ద క్రమేపీ వరద పెరుగుతుండటంతో జిల్లాలో నదీ తీర గ్రామాల వాసులు కలవర పెడుతున్నారు. కనకాయలంక కాజవే నీటమునగడంతో పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. జి.పెదపూడి లంక నదీ పాయ లో వరద నీరు ప్రవహిస్తుండటంతో నాలుగు లంక గ్రామాల ప్రజలు నాలుగు రోజుల నుంచి పడవల పైనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. పాశర్లపూడి, అప్పనపల్లి రోడ్డు మార్గం లో పాటురేవు లో వరదనీరు చేరింది. పశుగ్రాసం వరదనీట మునగటం తో వారం రోజులు నుంచి పశువులకు మేత లేక రైతులు ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. **అయినవిల్లి** భారీ వర్షాలకు అయినవిల్లి మండలంలోని సిరిపల్లి, నేదునూరు పలు గ్రామాల్లోని పంటపొలాలు నీట మునిగాయి. నీటి మునిగిన పంట పొలాల నుండి మురుగు నీరును దిగువకు దింపేందుకు అక్రమ ఆక్వా చెరువులతో ప్రధాన డ్రెయిన్లు పూడుకుపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు నిలిచిపోయి పంట పొలాలు చెరువులను తలపిస్తూ వరి నాట్లు నీటిలోనే మునిగి తేలాడుతున్నాయి. **రామచంద్రపురం** భారీ వర్షాలకు గోదావరిలో వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. ముందు జాగ్రత్త సరిగా కోటిపల్లి ముక్తేశ్వరం రేవులో పడవ ప్రయాణాలు పూర్తిగా నిలిపివేశారు. కోటిపల్లి భారీ వర్షాలతో రేవులో షాపులన్నీ మూతపడ్డాయి జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. బుధవారం ఉదయం కె.గంగవరం తహశీల్దార్ వైద్యనాథ శర్మ పంచాయతీ అధికారులతో కలిసి కోటిపల్లి రేవులో పరిస్థితిని సమీక్షించారు. గోదావరి ఉధృతి తగ్గే వరకు ప్రయాణాలు నిలిపివేయాలని ఆయన సూచించారు. భారీ వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, విఆర్‌ఒలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన సూచించారు. ఇప్పటికే లంకల్లోని పల్లపు ప్రాంతాలన్నీ వరద నీటిలో మునిగి ఉన్నాయి. **రామచంద్రపురం** భారీ వర్షాలకు తోడు వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువన గోదావరి నదికి వస్తున్న వరదనీరుతో గోదావరి పరివాహక ప్రాంతంలోని బలహీన ఏటిగట్ల వద్ద అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కె.గంగవరం మండలంలోని కోట్ల సుందరపల్లి వద్ద ఏటిగట్టును కె.గంగవరం తహశీల్దార్ బుధవారం పరిశీలించారు సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యగా ఇసుక మూటలు వేసి ఏటిగట్టుకు రక్షణ కల్పించారు. ఇప్పటికే ధవళేశ్వరంలో ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమై గోదావరి పరివాహక ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గురువారానికి వరదనీటి ప్రభావం మరింత పెరిగితే లంక భూములు లోతట్టు ప్రాంతాలు జలమయ్యే అవకాశం ఉంది. **కపిలేశ్వరపురం** మండలంలోని కోరిమిల్లి లో గోదావరి వరద ఉధృతిని బుధవారం తహశీల్దార్ కె. సూర్యారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పరిస్థితులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వరదల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట డిటి వెంకటేశ్వరరావు, విఆర్‌ఒలు సిబ్బంది, పాల్గొన్నారు **ఆత్రేయపురం** మండలంలోని గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లొల్ల గ్రామంలోని పంచాయతీ చెంతనే ఉన్న పెంకుటిల్లు కూలిపోయింది. ఈ సమయంలో ఇంటి యజమాని బండి ఆంజనేయులు ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే వద్దిపర్రు గ్రామంలో జుజ్జవరపు సూర్యకాంతం ఇంటి పైకప్పు ఉండగా ఆమెపై కూలిపోవడంతో ఆమె భుజానికి బలమైన గాయం అయింది. మండలంలోని గ్రామాలలో పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి.

వరద నీటమునిగిన కనకాయ లంక వద్ద కాజవే

సిరిపల్లిలో భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు

సుందరపల్లి ఏటిగట్టు వద్ద ఇసుక బస్తాలు వేయిస్తున్న దృశ్యం

లొల్ల గ్రామంలో కూలిన పెంకుటిల్లు

కోరిమిల్లి వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని లంక గ్రామాలైన అయినవిల్లి లంక తోగరు పాయి వంతెన వద్ద వరద ఉధృతిని, లంక గ్రామాల్లోని గోదావరి వరద ముంపు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. ఈ సందర్భంగా వరద పరిస్థితులపై గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. భారీవర్షాలు, వరదల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వరద ఉధృతి తగ్గే వరకు రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ, వైద్య సిబ్బంది, యన్‌డిఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్‌డిఒ ముక్కంటి, డిప్యూటీ తహశీల్దార్ అశోక్ ప్రసాద్, ఎంపిడిఒ వెంకటాచార్యులు, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం తుపాన్ హెచ్చరిక కేంద్రం ప్రత్యేక వాతావరణ బులిటెన్ విపత్తుల నిర్వహణ సంస్థ కమిషనర్ వారి హెచ్చరికల దృష్ట్యా ఈ నెల 28వ తేదీ వరకు గోదావరి తీర ప్రాంతం, సముద్ర తీర ప్రాంతం వెంబడి ఉన్న జిల్లావాసులు అప్రమ త్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కారుణ్య నియామకాలు తక్షణం ఇవ్వాలి

ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-అమలాపురం

కోవిడ్-19 వలన రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు 2917 మంది మరణించారని, వీళ్లందరికీ కారుణ్య నియామకాలు ఇవ్వాల్సి ఉండగా ఆయా శాఖల్లో ముఖ్యంగా స్థానిక సంస్థలు, ఇతర శాఖల్లో ఖాళీలు లేకపోవడం వలన వీళ్ల కారుణ్య నియామకాల పొందలేక పోయారనీ పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సిఎంకు, అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆదిత్యనాథ్ దాస్‌కి పిడిఎఫ్ తరపున, అలాగే ఉద్యోగ సంఘాల జెఎసి తరపున వన్ టైం సెటిల్మెంట్‌గా అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలను ఓపెన్ చేసి కారుణ్య నియామకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని ఎంఎల్‌సి ఐవి అన్నారు. జిఒ ఆర్‌టి నెంబర్1473 26.7.23న ఉత్తర్వులు విడుదల చేయటం జరిగిందనీ, ఉత్తర్వుల్లో 2917 మందికి గాను ఇప్పటికీ 1488 మందికి మాత్రమే ఆయా శాఖలలో కారుణ్య నియామకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా 1149 మంది వెయిటింగ్ లో ఉన్నట్లుగా ఈ సమాచారాన్ని జిఏడి వారు రప్పించుకున్నారనీ, ఈ 1149 మందికి ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు, సచివాలయ కార్యదర్శులుగా కారుణ్య నియామకాలు ఇవ్వాలని అధికారులని ఆదేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారన్నారు ఆ మేరకు జిల్లా కలెక్టర్లు వెంటనే వీరికి కారుణ్య నియామకాలు ఇవ్వాలని ఎంఎల్‌సి ఐవి బుధవారం విజ్ఞప్తి చేశారు.

పలివెల వద్ద గల జెడ్ బ్రిడ్జిని పునర్నిర్మించాలి

అమలాపురం అమలాపురం -బొబ్బర్లంక రోడ్డు, కొత్తపేట మండలం పలివెల వద్ద గల జెడ్ బ్రిడ్జి చాలా ఇరుకుగా ఉన్నంని, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి అన్నారు. ఈ వంతెనపై భారీ వాహనాలు, ఒఎన్‌జిసి వాహనాలు, ఇసుక, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తులతో గల వాహనాలు నిరంతరము తిరుగుతూ ఉంటాయనీ ఈ వంతెన అమలాపురం, రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్లకు ప్రధాన అనుసంధానంగా ఉన్నదనీ ఐవి అన్నారు. రూ.నాలుగు కోట్ల అంచనా విలువ గల ఈ బ్రిడ్జిని వంకరలు లేకుండా అలైన్మెంట్ మార్చి నూతన బ్రిడ్జి నిర్మించాలని బుధవారం మంత్రి దాడిశెట్టి రాజాకి ఎంఎల్‌సి ఐవి లేఖ తెలిపారు.

శిధిలావస్థకు చేరిన పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

పేరూరు వై.జంక్షన్ వద్ద శిధిలావస్థకు చేరిన ఎంపిపి పాఠశాల ను ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ బుధవారం ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపనంటున్నారని, పాఠశాల భవనాన్ని నిర్మించాలని తమ దష్టికి వచ్చిందని అన్నారు. పాఠశాల భవన స్థితిగతులను పరిశీలించామని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ను కలిసి వివరిస్తానని అన్నారు.

రేషన్ కార్డుదారులతో సర్పంచ్ తమ్మన

నూతన రేషన్ కార్డుల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో అనివార్య కారణాలవల్ల తొలగించబడ్డ రేషన్ కార్డులతో పాటుగా, నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, కార్యదర్శి యు.రేణుక ఆధ్వర్యంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. దీనిపై తహశీల్దార్ ఐపి.శెట్టిని ప్రశ్నించగా గతంలో అర్హత ఉండి, ఆన్లైన్ వచ్చిన తర్వాత వివిధ కారణాలతో అనర్హులుగా మారిన వారి సమస్యలను పరిశీలించి పరిష్కారం చేశామన్నారు. కార్యక్రమంలో దొండపాటి చంటి, దొండపాటి వెంకటేశ్వరరావు మోటూరి సురేష్, అడబాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం

సీఎం సభకు బస్సులు తరలించడంతో అవస్థలు	గంటల తరబడి వర్షంలో ఎదురు చూపులు

'మణిపూర్'అమానుష ఘటనలపై నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

మణిపూర్‌లో అమానుషఘటనలపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. మణిపూర్ దమనకాండపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోన సీమ జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. **ఐ.పోలవరం** మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లకు పాల్పడే అరచకశక్తులపై కఠిన చర్యలు తీసుకుని ,మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఝాన్సీ లక్ష్మి కుమారి వినతిపత్రాని అందజేశారు. కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి టి.నాగలక్ష్మి, నిమ్మకాయల వెంకటేష్, తోట గంగారత్నం, కె.నాగలక్ష్మి, జి.గంగాభవాని, ఎవి.రత్నం, పి.అనంతలక్ష్మి, పి.నాగమణి, గోవింద్ రాజ్, ముమ్మిడివరపు సుబ్బారావు పాల్గొన్నారు. **మండపేట** మణిపూర్ లో జరుగుతున్న అల్లర్లకు, అత్యాచారాలకు నిరసనగా యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ, నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ కె. గోపాలకష్ణారెడ్డి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం తక్షణం అరికట్టి దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి డివి రాఘవులు మాట్లాడుతూ తక్షణం దాడులను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ చల్లా రవికుమార్ మాట్లాడుతూ తెగల మధ్య జరుగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం అరికట్టి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి. సురేంద్ర కుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో మారణకాండకు పాల్పడిన వారిని తక్షణం అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బేతినిడి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు, రాయుడు శ్రీనివాస్, గొల్లపల్లి రాజు మండపేట పట్టణ శాఖ అధ్యక్షులు పి. రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వైవి రమణ, కపిలేశ్వరపురం అధ్యక్షులు శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మణిపూర్ ప్రజలకు మహిళలకు రక్షణ కల్పించాలని హింసకు పాల్పడిన మతోన్మాదులను దోషులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు.మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకటబాబ్జి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో అమలాపురం రూరల్ సిఐ వీరబాబు, ఎస్ఐ జి.వెంకటేశ్వర రావులకు వారు వినతి పత్రం అందజేశారు వినతి పత్రం అందజేసిన వారిలో ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, మాల మహానాడు నాయకులు పెయ్యల కొండబాబు, కొంకి బాలకృష్ణ, భగవాన్ దాస్, కిరణ్ కుమార్,మొసలి శ్రీనుసాధనాల సురేంద్ర తదితరులున్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ఐ.పోలవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ఉప్పలగుప్తంలో వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడునాయకులు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వెంకన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీని బుధవారం ఆలయ ముఖ మండపంలో పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి వారి దేవస్థానం ఇఒ ఎన్‌విఎన్‌ఎస్‌వి.ప్రసాద్ రాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఇఒ ఎం.రాధాకష్ణ పర్యవేక్షణలో లెక్కించారు. 24 రోజులకు రూ .66,14, 313, 26గ్రాముల బంగారం, 585 గ్రాముల వెండి, విశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1,53,994 సమకూరింది. వివిధ దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లు వచ్చాయి. లెక్కింపు కార్యక్రమం లో వాడపల్లి వెంకన్న ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు, గ్రామ సర్పంచ్ పోచిరాజు బాబురావు ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన సౌలభ్యం కోసమే జగనన్న సురక్ష

ప్రజాశక్తి-రామచంద్రపురం

పరిపాలన వ్యవస్థ మరింత సౌలభ్యతరంగా ఉండే విధంగా జగనన్నకు చెబుదాంకు అనుసంధానముగా సిఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం పట్టణం పరిధిలో సచివాలయం 11 లో గల, 25,28 వార్డులకు ఏర్పాటుచేసిన సభలోలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ కే శ్రీకాంత్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు లక్ష్మీ శివాజీ, సునీత గణేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

ప్రజా సమస్యల పరిష్కారానికే..

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అర్హులైన వారందరు వినియోగించుకోవాలని తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ కె.జాన్ లింకన్ అన్నారు. మండలంలోని నవాబుపేటలో సర్పంచ్ సూరంపూడి ముత్యాలమ్మ, గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబుల అధ్యక్షతన బుధవారం సురక్షను నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, డిటి జానకి రాఘవ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో పాల్గొన్న తహశీల్దార్ శెట్టి

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో గత సంవత్సరం పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని పెంటపాటి కనకదుర్గ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు వివికె. మందేశ్వరరావు తెలిపారు. 582 మార్కులు సాధించిన కనకదుర్గ నూజివీడు రాజీవ్ గాంధీ టెక్నాలజీ సంస్థ ట్రిపుల్ ఐటీ ప్రథమ కౌన్సిలింగ్ లో ప్రవేశం సాధించిందన్నారు. విద్యార్థినికి ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ముంపు సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ముంపుసమస్యతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చల్లపల్లి పోతురాజు గుడి వీధికి చెందిన ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ వీధి అంతా వర్షపు నీరు నిలిచి పోవడంతో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి, పంచాయతీరాజ్ ఎఇ,వి.రాధాకృష్ణ లు బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. దీంతో అధికారులకు వారు పడుతున్న ఇబ్బందులను ఆ వీధికి చెందిన మహిళలు ఏకరువు పెట్టారు.గత ఏడాది తాము పడుతున్న ఇబ్బందులను అధికారులకు విన్నవించుకున్నా అభివద్ధి చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.నీరు నిలిచిపోవడంతో దోమలు చేరి అనారోగ్యాలు పాలవుతున్నామని ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్న మోకాళ్ళ లోతు వర్షపు నీటిలో తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.తాము పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు రోడ్డును ఎత్తు చేసి సిసి డ్రైన్లునిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అంబాజీపేట లో సుబ్బారావు పుట్టినరోజు వేడుకల

ఘనంగా సుబ్బారావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - అంబాజీపేట

మండల టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు నాగాబత్తుల సుబ్బారావు పుట్టినరోజు వేడుకలు ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేకును కట్ చేయించి సుబ్బారావుకు పూలదండలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీకి మంచి పేరు తెస్తున్న నాయకుడు సుబ్బారావు భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజు వేడుకలు ఆకాంక్షించారు. సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, గూడాల ఫణి, జి.వి.రాఘవులు, బి.పెదబాబు, చిన్నం విజయారావు, పెదపూడి శ్రీను, టిడిపి శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పలువురు బుధవారం ఆర్థిక సాయం అందించారు. **ఉప్పలగుప్తం** కూనవరానికి చెందిన జన సైనికుడు బడుగు గోపి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధితునికి బుధవారం అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు చేతుల మీదుగా రూ.10 వేలసాయం అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు, నాయకులు ఆకుల బుజ్జి, వాకపల్లి సత్యనారాయణ, గండి స్వామి, గొలకోటి వెంకటేష్, నాగిరెడ్డి రాంబాబు, దివ్వ రాజు, సుందరనీడి రాజా,అర్లపల్లి దుర్గ,మధుర జాన్ తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం** అల్లవరం మండలం రెల్లిగడ్డ గ్రామంలో బొమ్మి నాగ వీర వెంకట సత్యనారాయణ గత కొంతకాలంగా కామెర్ల వ్యాధితో అమలాపురం లోనీ ఒక ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందాడు. ప్రస్తుతం ఇంటివద్ద చికిత్స పొందుతున్న ఆయనను అల్లవరం మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. మందుల ఖర్చు నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రెల్లిగడ్డ గ్రామ కమిటీ అధ్యక్షులు నడింపల్లి చంటి రాజు,సమన్వయ కమిటీ నాయకులు కడలి వెంకటేశ్వరరావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పశ్చిమాల ఏడుకొండలు, అల్లవరం గ్రామ కమిటీ అధ్యక్షులు మామిడిశెట్టి శ్రీరామ్, నడింపల్లి వెంకట సుబ్బరాజు బొమ్మి చంద్రరావు, బొమ్మి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సాయం అందజేస్తున్న రాజబాబు

రెల్లిగడ్డ గ్రామంలో బాధితునికి సాయం అందజేస్తున్న సత్యనారాయణ

మెయిన్ రోడ్డుపై వరి నాట్లు వేసి కాంగ్రెస్ నేతల నిరసన

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఐదేళ్లుగా పాడైపోయి ఉన్నా రామచంద్రపురం-ద్రాక్షారామ మెయిన్ రోడ్డుపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధ వారం వరి నాట్లు వేశారు. పార్టీ నాయకులు కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రోడ్డును నాయకులు ఎవరూ పట్టించు కోవడం లేదన్నారు. వెంటనే రోడ్లు ఆధునికీకరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలబాలాజీని దర్శించుకున్న డిఎస్‌పి

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని కొత్తపేట డిఎస్‌పి కెవి.రమణ బుధవారం దర్శించుకున్నారు. ఆయన ఆలయ అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు పి. గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

27న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక విజయలక్ష్మి నగర్ లోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్థంతి సందర్భంగా 27న ఉదయం 9 గంటల నుంచి ట్రస్ట్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్లు ట్రస్ట్ సభ్యులు బుధవారం తెలిపారు యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న కారు

ప్రజాశక్తి -అంబాజీపేట

అంబాజీపేట మండలం ముక్కామల చిన్న వంతెన వద్ద ఆర్‌టిసి బస్సు, కారు బలంగా ఢీకొన్నాయి. విజయవాడ నుంచి అమలాపురం వస్తున్న ఆర్‌టిసి బైపాస్ ఎక్స్‌ప్రెస్ అమలాపురం నుంచి మండపేట వెళుతున్న కారు బుధవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యి కారు ప్రక్కనే ఉన్న పాన్ షాపు వద్దకు దూసుకువచ్చింది. అదృష్టవశాత్తు షాపులోకి వెళ్లకుండా ఆగిపోయింది. కారు ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.70 లక్షల సొత్తు చోరీ

ప్రజాశక్తి-కడియం

రామచంద్రపురం నుంచి వేమగిరి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన ఒక మహిళ నగదు, బంగారు వస్తువులు కలిగిన తన బ్యాగు పోగొట్టుకున్న సంఘటన ఈ నెల 15న జరిగింది. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామానికి చెందిన కుడిపూడి శాంతకుమారి తన సోదరి కుమార్తెతో కలిసి రామచంద్రపురం నుంచి స్వగ్రామం చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించింది. కడియం మండలం వేమగిరి చేరేసరికి సుమారు రూ.లక్షా 70 వేల నగదు, బంగారు వస్తువులు ఉన్న బ్యాగ్ అపహరణకు గురైనట్టు గుర్తించారు. బుధవారం కడియం పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కడియం ఎస్ఐ ఎస్.శివాజీ తెలిపారు.

ఎస్ఇబి దాడుల్లో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కొత్తపేట

యానాం నుంచి మద్యం సీసాలు తెచ్చి, వాటిపై ఆంధ్రప్రదేశ్ మద్యానికి సంబంధించిన ఫేక్ లేబుళ్లు అతికించి అమ్ముతున్న ముగ్గురిని కొత్తపేట ఎస్ఇబి సిఐ మద్దాల శ్రీనివాస్, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన గుడాల చంద్ర శేఖర్‌స్వామిని అదుపులోకి తీసుకుని కారు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణలో అతనికి ఫేక్ లేబుళ్లు అందజేస్తున్న, పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంటకు చెందిన పేడా భూపతి సింగ్, 'ఉద్ధ డిజిటల్' యజమాని పొలనాటి సాయిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 270 ఫేక్ లేబుళ్ళు, ప్రింటింగ్‌కు ఉపయోగిస్తున్న కంప్యూటర్, స్కానర్, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫేక్ లేబుళ్ళు పట్టుకున్న సిఐలు మద్దాల శ్రీనివాస్, కె.వీరబాబు, సిబ్బందిని ఎస్ఇబి ఖాదర్ బాషా అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన సామర్లకోటకు చెందిన కెవివి.సత్యనారాయణను పోలీసులు కాకినాడ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారం రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సి.ఐ దుర్గా ప్రసాద్ చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా సామర్లకోట పట్టణంలో తమ సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నంబర్ ప్లేట్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి సీజ్ చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా విద్యుత్ స్తంభానికి కరెంట్ రావడంతో ఆ స్తంభాన్ని తాకడంతో మృత్యువాత పడింది. అచ్యుతాపురం గ్రామానికి చెందిన బత్తుల బుజ్జియ్యకు చెందిన ఈ ఎద్దు మెరవ వీధిలో చనిపోయింది.

20 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక జాతీయ రహదారిపై పోలీసులు 20 కేజీల గంజాయి, ఒక బైక్, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియపులంక జాతీయ రహదారిపై వెంకాయమ్మ పేట సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా మూటలతో వస్తున్న వాహనాన్ని గుర్తించారు. 20.330 కేజీల గంజాయితో పాటు, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలోని పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన పోలంకి సుబ్బారావు, ఇదే గ్రామానికి చెందిన గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్న మర్రి శామ్యూల్, విజయవాడకు చెందిన ఒక బాలుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నర్సీపట్నం ప్రాంతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రు గ్రామంలో గోదావరి ఏటిగట్టు వద్ద పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.73,650 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.సూర్యభగవాన్ తెలిపారు.

చోరీల కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ క్రైం

కాకినాడ పరిసర ప్రాంతాలతో పాటు జిల్లాలో కొత్త ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి పి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం శ్రీరామ్ నగర్‌కు చెందిన నార్ని సతీష్ చంద్ర, బుడగ ఆనంద్ కుమార్, సామర్లకోటకు చెందిన సిద్దార్థ నగర్ చెందిన కర్రి నాగకిషోర్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14 లక్షల విలువైన కార్లను సర్పవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. తాళం వేసి ఉన్న ఇళ్ళే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతూ..., ఓ.ఎల్.ఎక్స్‌లో అమ్మకాలు సాగిస్తున్నట్టు తెలిపారు. వీటిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీరిని అరెస్టు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన సర్పవరం సిఐ ఆకుల మురళీకృష్ణ, క్రైమ్ సిబ్బంది జి.సత్యనారాయణ, బి.గణేష్, ఎ.వెంకటరత్నం, ఎం.సతీష్ కుమార్లను అభినందించారు.

ఈ రోడ్లలో ఆదమరిస్తే అంతే..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కాస్త ఆదమరిస్తే సామర్లకోట నుండి నిత్యం కాకినాడ, పిఠాపురం పట్టణాలకు తరలివెళ్ళే ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలు పాలవడం ఖాయం... ఇది ఎక్కడో పుంత రోడ్లలో కాదు గాని సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే ప్రధాన రహదారిలోనూ, సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్లే ప్రధాన రహదారి లోనూ అత్యంత ప్రమాదకరంగా రహదారులు భారీ గోతులతో నిండి ఉన్నాయి. కాకినాడ రోడ్డులో వికె.రాయపురం - మాధవపట్నం గ్రామాల మధ్య ప్రధాన రహదారి గోతుల మయమై కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అది జలాలతో నిండుకొని ప్రజలు అంచనాకు అందకుండా ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. పిఠాపురం రోడ్డులో ఏలేరు పెద్ద వంతెన వద్ద నుండి కోదండరామపురం వరకు రహదారి గోతులతో నిండి చిద్రమై ప్రయాణికులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. కాకినాడ రహదారిలో ఆర్ అండ్ బి అధికారులు ఎన్ని మార్లు గోతులు పూడ్చిన అవి మరలా మరలా పునరావతం అవుతున్నాయి. రిపేరు పనుల్లో నాణ్యత పాటించకపోవడమే దీనికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. పిఠాపురం ప్రధాన రహదారిని బ్రౌన్‌పేట సెంటర్, కోటపేట నుంచి పిఠాపురం మండలం ఎఫ్‌కె.పాలెం గ్రామం వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. దానికిగాను రూ.కోట్ల నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు విస్తరణ పనులను నిలిపివేశారు. దానితో కొత్తగా నిర్మించిన వంతెనకి ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో పాటు టిడ్కో గహాల సముదాయాల వద్దనుండి కోదండరామపురం వరకు రోడ్డుకు విపరీతమైన గోతులు పడడంతో వర్షపు నీళ్లలో అవి కనిపించక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారుల పరిస్థితి అందరూ అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రతిరోజూ కనిపిస్తున్న అలాంటి రహదారులపైనే వారు రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా ప్రతిరోజూ వేలాది వాహనదారులు ఈ రహదారులపై ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ రహదారి సమస్య పరిష్కారానికి ఏ ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధి ప్రయత్నించడం లేదు. వాహనాలపై ప్రయాణించే ప్రజలు ప్రధానంగా రాత్రి సమయాల్లో గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. ప్రజల సమస్యను అధికారులు గుర్తించి ఇప్పటికైనా రహదారుల నిర్మాణం, లేదంటే నాణ్యమైనరిపేరు పనులు చేపట్టి ప్రమాదాల నుంచి ప్రయాణికులను, ప్రజలను కాపాడాలని పలువురు ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

కాకినాడ రోడ్డులో వికె.రాయపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న గోతులు

పిఠాపురం రోడ్డులో టిడ్కో గృహాల వద్ద రోడ్డు దుస్థితి

జగనన్న ఇళ్లు సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రాష్ట్రంలో ఆగస్టు 20 నుంచి 23వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సామర్లకోటలో చేపట్టే అవకాశం ఉన్నందున ఈ అంశంపై మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం సాయంత్రం కమిషనర్ చాంబర్లో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కాకినాడ డిఎల్‌డిఒ పాఠంశెట్టి నారాయణమూర్తి, తహసిల్దార్ ఎస్ఎల్ఎన్.కుమారి, ఇంకా విద్యుత్ శాఖ, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి పట్నాయక్ సామర్లకోట మున్సిపాలిటీలో జగనన్న ఇల్లు పథకం కింద ఎన్ని గృహాలు నిర్మాణం జరుగుతుంది, ఇప్పటివరకు ఎన్ని గహాలు పూర్తయ్యాయి అనే అంశంపై మున్సిపల్ కమిషనర్ రామారావును, హౌసింగ్ డిఇ రాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 2,800 గహాలు నిర్మాణం జరుగుతున్నట్టు వారు వివరించారు. వాటిలో ఇప్పటికీ అన్ని పనులు పూర్తయి ప్రారంభానికి 750 గృహాలు సిద్ధంగా ఉన్నాయని పీడీకి వివరించారు. ఆగస్టు 20 కల్లా ఇంకా ఎన్ని గృహాలు నిర్మాణ పనులు పూర్తి చేయగలిగితే వాటన్నిటినీ త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హౌసింగ్ పీడీ అధికారులకు సూచించారు. జగనన్న ఇళ్లు కాలనీలో మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, రోడ్లు, డ్రైవ్ వంటి అన్ని సదుపాయాలు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానిక మున్సిపాలిటీలో గహాలు ప్రారంభానికి విచ్చేసేందుకు దాదాపు అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గహ నిర్మాణాల ప్రగతిని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలపాలని పీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ హౌస్సెన్ ట్రాన్స్‌కో ఎడిఎ కిరణ్, ఎఇ పి.రమేష్ కుమార్, సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న పీడీ సుధాకర్ పట్నాయక్

నవోదయకు ఎన్‌సిసి కమాండర్ ప్రశంస

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో ఫైరింగ్ రేంజ్‌లో శిక్షణ పొందిన వివిధ జిల్లాల ఎన్‌సిసి విద్యార్థులు అద్భుత నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారని ఎన్‌సిసి ఎయిర్ కమాండర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సిసి డైరెక్టరేట్ డిడిజి ఇఎం.రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కల్నల్ ఎకె.రిషితో కలిసి నవోదయ విద్యాలయలోని ఫైరింగ్ రేంజ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వేసవి సెలవులలో వివిధ జిల్లాలకు చెందిన 1500 మంది ఎన్‌సిసి విద్యార్థులకు ఈ విద్యాలయంలో ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఫైరింగ్‌లో ఎన్నో పతకాలు సాధిస్తున్నారన్నారు. ఈ విషయంలో పెద్దాపురం నవోదయ విద్యాలయ అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌సిసి విద్యార్థుల వికాసానికి ఎంతో కృషి చేస్తున్న ప్రిన్సిపల్ కె.రామిరెడ్డిని సత్కరించి మెమెంటో అందజేశారు. ఎన్‌సిసి ఆఫీసర్ పి.కిషోర్ కుమార్, నవోదయ సిబ్బందిని ఆయన అభినందించారు.

శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ఉపాధ్యాయులందరికీ రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి కెహెచ్.నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఇఒ నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఒకటి నుండి ఐదు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు అందరూ హాజరయ్యారన్నారు. ఈ సమావేశంలో ఆగస్టు మొదటి వారంలో జరగబోయే ఫార్మేటివ్ వన్ అసెస్మెంట్ సంబంధించి సూచనలు ఇచ్చినట్టు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో విద్యార్థులకు అమలు చేయాల్సిన కార్యక్రమాలను విజయవంతంగా చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

సత్వరమే గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే పూర్తి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

బడి బయట పిల్లలు, డ్రాపౌట్లను సత్వరమే గుర్తించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే ప్రకారం సంబధిత పాఠశాలల్లో చేర్పించాలని డిఇఒ కె.అన్నపూర్ణ ఆదేశించారు. బుధవారం సామర్లకోట మండలం మాధవపట్నంలో నిర్వహిస్తున్న జిఇఆర్ సర్వే సందర్భంగా మాధవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ అన్నపూర్ణ మాట్లాడుతూ గుర్తించిన బడి బయట పిల్లలను, మధ్యలో బడి మానేసినవారిని ఆయా ఏరియాలకు చెందిన పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు చేర్పించే బాధ్యతలు చేపట్టాలన్నారు. జిఇఆర్ సర్వేకు ఎంఇఒలు సహకరించాలని సూచించారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తిచేయాలని డిఇఒ చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో బడి బయట గుర్తించిన బడి బయటి పిల్లలు పాలెపు సతీష్, అనసూరి పావనిలను డిఇఒ అన్నపూర్ణ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య, హెచ్ఎం ఎల్.గోవిందరాజులు పాల్గొన్నారు.

పిల్లలను హైస్కూల్ చేర్పిస్తున్న డిఇఒ

ఓటర్ల జాబితాలో మార్పులు

ప్రజాశక్తి-పెదపూడి

ఓటర్ల జాబితా పరిశీలించి, సవరణ, మార్పులు, చేర్పులు బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బిఎల్ఒలకు ఓటర్ల జాబితలో మార్పులు, చేర్పులు, సవరణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 21 నుంచి ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. బిఎల్ఎలు అందరూ వారి పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్ల జాబితా సవరించాలన్నారు. ఓటర్ ఫోటో, అడ్రసు, పేర్లు మార్పులుపై 6ఎ, 7, 8ఎ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిటి రామ్ కుమార్, ఆర్.ఐ త్రివేణి పాల్గొన్నారు.

శ్రీరాములు మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి-పెదపూడి

టిడిపి సీనియర్ నాయకుడు మూకల శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర బిసి సెల్ మాజీ కార్యదర్శి, కాండ్రేగుల మాజీ సర్పంచ్ మూకల శ్రీరాములు (70) బుధవారం తుదిశ్వాస విడిచారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకష్ణారెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పుట్టాగంగాధర చౌదరి, రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు చిర్రా వరప్రసాదరావు, జిల్లా బిసి సెల్ నాయకులు పలివెల బుజ్జి, టేకుమూడి రాంబాబు, నల్లమిల్లి మనోజ్ నివాళులర్పించారు.

ఓటర్ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఓటరు వెరిఫికేషన్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వడ్లమూరులో నిర్వహిస్తున్న ఓటర్ వెరిఫికేషన్ సర్వేను బుధవారం ఆర్‌డిఒ జె.సీతారామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కళ, వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీర రాఘవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేట ఆపాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పట్టణ ప్రజలకు నిత్యం రక్షిత తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ చెరువులో చేపల వేటను ఆపాలని కోరుతూ 13వ వార్డు వైసిపి కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ను కలిసి మాట్లాడారు. మంచినీటి చెరువులో చేపలు వేటకు ఒక వారం పది రోజులు తప్ప నెలలు తరబడి అనుమతినివ్వడం వల్ల రాత్రీ పగలూ యథేచ్ఛగా చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. అసలే వర్షాకాలం ప్రారంభమై జలాలు కలుషితమవుతున్న నేపథ్యంలో చేపలు వేట వల్ల చెరువులో ఉన్న జలాలు మరింత కలుషితమై ప్రజలు డయేరియా, పచ్చకామెర్ల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే చేపల వేట నిలిపివేయాలని ఆయన కమిషనర్‌ను కోరారు. చేపల వేట విషయానికి సంబంధించి కౌన్సిలర్లు నిర్వాహకుల నుంచి ముడుపులు అందుకున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. కేవలం సొసైటీ వారు మున్సిపాలిటీకి చలానా రూపంలో ఆ సొమ్మును చెల్లించారని దానికి కౌన్సిల్‌కి ఎలాంటి సంబంధం లేదని హరిబాబు స్పష్టం చేశారు. ఈ ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. చేపల వేట విషయమై కమిషనర్ రామారావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా తక్షణమే చేపల వేట నిలిపివేతకు ఆదేశించనున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన విద్యా బోధన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో శాస్త్ర సాంకేతిక రంగాలతో కూడిన విద్యను అందించడానికి ప్రభుత్వం పానెల్ బోర్డులు స్మార్ట్ టీవీలు అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2. పి.పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం సామర్లకోట మండలం వేట్లపాలెం హైస్కూల్‌లో వేట్లపాలెం, మేడపాడు కాంప్లెక్స్‌కు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ ప్రధాన ఉపాధ్యాయిని పి.అనురాధ అధ్యక్ష వహించారు. రెండో రోజు శిక్షణలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఇఒ-2 పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన పుల్లయ్యను వేట్లపాలెం కాంప్లెక్స్, మేడపాడు కాంప్లెక్స్ సెక్రటరీలు ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ సహ కార్యదర్శి కె.బలరాం చౌదరి, మేడపాడు, వేట్లపాలెం కాంప్లెక్స్ సంబంధించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు ఎ.వీర్రాజు, కె.ఉమా పాల్గొన్నారు.

పుల్లయ్యను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

యానాం వార్తలు

మత్స్యకారులకు న్యాయం కోసం మళ్లీ దీక్ష

ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

ప్రజాశక్తి - యానాం

చేపలవేటనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న యానాం మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ అందించే నష్టపరిహారం సొమ్ము అర్హులందరికీ అందాలని, లేకుంటే మళ్లీ నిరాహార దీక్షకు సైతం సిద్ధమని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల జాబితాను మత్స్యశాఖ విడుదల చేసిందని అయితే దానిలో చాలామంది అర్హులైనవారి పేర్లు గల్లంతయ్యాయని అనేక మంది ఆవేదన చెందుతున్నారని చెప్పారు. దీనిపై తాను ఆర్ఎఒ మునిస్వామితో సమావేశమయినట్లు తెలిపారు. తాను రిజిష్టర్ బోట్లతో పాటు అన్ రిజిస్టర్ బోట్లను సైతం ఎట్టిపరిస్థితుల్లోను పరిగణనలోనికి తీసుకుని లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని గతంలోనే సూచించినట్లు చెప్పారు. దీంతో సిఎం రంగసామి, ఎల్‌జి తమిళసై సౌందరాజన్, మత్స్యశాఖ మంత్రి,పుదుచ్చేరి ఉన్నతాధికారులు సైతం దానికి అంగీకరించి ఆవిధంగా నిబంధనలకు సవరణ చేశారన్నారు. ఆ విధంగా అప్పట్లో జిఒ విడుదల చేశారన్నారు. ప్రస్తుతం వచ్చిన జిఒలో మార్పులు ఉండటంతో అర్హులైన చాలామందికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చే నిబంధనలనే యానాంలో సైతం అమలు చేయాలని తాను కోరానని తెలిపారు. వేటనిషేధ సమయంలో ఖాళీగా ఉండక ఉపాధి కోసం పలువురు మత్స్యకారులు పలుచోట్లకు కూలిపనికి సైతం వెళ్లారని అటువంటి వారిని ప్రస్తుతం మత్స్యకారులు కాదంటే ఎలా అని ప్రశ్నించారు. అటువంటివారికి సైతం న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. మత్స్యకారుల్లో అర్హులైనవారికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని పరిహారం సొమ్ము ఎవరైతే లబ్దిదారుడు ఉన్నాడో ఆ కుటుంబానికి మాత్రమే చెందాలని వారే దానిని అనుభవించాలన్నదే తన తపన అని పేర్కొన్నారు. రూ.కోట్లాది మత్స్యకారుల పరిహారం ఏ స్వచ్ఛంద సంస్థకో దారిమళ్లకూడదన్నదే తన పోరాటమని పేర్కొన్నారు. చాలామంది దీనిని రాజకీయం చేయాలని చూస్తున్నారని తానే ఆపుతున్నట్లు ప్రచారం చేయడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 6 నెలలనుంచి పరిహారం జరగాలని పుదుచ్చేరిలో అధికారుల చుట్టూ తిరుగుతుంటే ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. తాను, తన కార్యకర్తలు పరిహారం ఆపుతున్నానని అసత్యప్రచారం చేస్తున్నారని అటువంటివాటిని ఖండిస్తున్నట్టు చెప్పారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు పరిహారం ఆపాలని ఎన్ని ఎత్తుగడలు వేసినా అది జరగదని స్పష్టం చేశారు. మత్స్యకారులకు నష్టపరిహారం విషయంలో ఏవైనా అడ్డంకులు సష్టించినా ఆగినా వేలాదిమందితో మళ్లీ నిరవధిక నిరాహారదీక్షకు దిగుతానని, దీనిలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. పేదోడు గెలవాలని ప్రతి మత్స్యకార నాయకుడు కోరుకోవాలని, అంతేకాని దీనిని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. పరిహారంకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలకు సవరణలు చేసి మత్స్యకారులందరికీ న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

వినతిపత్రం అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఎంఎల్ఎ శివను కలిసిన సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డిఎంకె పార్టీ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ ఆర్.శివను యానాం కో-ఆపరేటివ్ స్టోర్స్ ఉద్యోగుల సంఘ సభ్యులు బుధవారం పుదుచ్చేరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌లో పని చేస్తున్న సిబ్బందికి రావాల్సిన 30 నెలల బకాయి వేతనాలు, సిబ్బందికి సంబంధించిన పది డిమాండ్లను ఆయనకు వివరించారు. అనంతరం వినతి పత్రాన్ని అందించారు. సిబ్బంది రిలే నిరాహార దీక్ష చేపట్టిన సమయంలో వారికి మద్దతుగా యానాం డిఎంకె పార్టీ మద్దతు ప్రకటించిందని అరదాడి పోసియ్య గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, రమణ, శ్రీనివాస్, రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జాతీయ విద్యా విధానంపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానం 2020 ప్రారంభమై మూడేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా స్థానిక నవోదయ విద్యాలయంలో ప్రధాన ఆచార్యులు టివిఎస్.ప్రకాష్ రావు బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు పాల్గొని జాతీయ నూతన విద్యా విధానం 2020 గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాబోయే 5 సంవత్సరాలలో రూ.27,360 కోట్లు వెచ్చించి విద్యా విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. ఈ విద్యా విధానం విద్యార్థుల్లో నైపుణ్యాభివద్ధిని పెంపొందిస్తుందని తెలిపారు.


నియామక ఉత్తర్వులను అందజేస్తున్న వేణుగోపాల్

మహిళకు కారుణ్య నియామకం

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం కాకినాడ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ఒకరికి ఉద్యోగ నియామక పత్రం అందించారు. దేవీపట్నం మండలము, గొందూరు గ్రామంలో ఎస్‌జిటిగా పని చేస్తూ అనారోగ్యం కారణంగా కురుపల్లి గోపి మరణించగా ఆయన భార్య టివి.రామలక్ష్మిని దేవీపట్నం మండల పరిషత్‌లో ఆఫీసు సబర్డినేట్‌గా నియమిస్తూ నియామక ఉతర్వులు అందజేశారు. ఈ కార్యక్రమములో ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎ.రమణారెడ్డి, ఎపి పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్‌వివి.రమేశ్, పాల్గొన్నారు.